# కామ్రేడ్స్ పున్నయ్య, శంకర్‌ల 27వ వర్ధంతి సభ



కామ్రేడ్స్ పున్నయ్య, శంకర్‌ల వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కా॥ఝాన్సి

**గుంటూరు, 12-11-19:**

**యువజనోద్యమ నాయకులు కామ్రేడ్స్ అంగడి పున్నయ్య, దేవరశెట్టి శంకర్‌ల 27వ వర్ధంతి సందర్భంగా 12-11-2019 ఉ॥11 గం॥కు స్థానిక చుట్టుగుంట సెంటర్‌లో సభ నిర్వహించారు. సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కామ్రేడ్ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు ఈ సభకు అధ్యక్షత వహించారు. తొలుత వక్తలు, సభకు హాజరైన ప్రజానీకం పున్నయ్య, శంకర్‌ల చిత్రపటాలవద్ద పూలు, పూలదండలతో నివాళులర్పించారు.**

సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు కామ్రేడ్ గుర్రం విజయకుమార్ సభలో మాట్లాడుతూ పీడిత ప్రజల్ని ముఖ్యంగా యువకుల్ని పీల్చి పిప్పిచేస్తున్న సారా, జూదాలకు వ్యతిరేకంగా పున్నయ్య, శంకర్‌లు యువకుల్ని కూడగట్టారన్నారు. పీడిత ప్రజల సమస్యల పరిష్కారంకోసం వర్గపోరాట చైతన్యంతో వారిని సంఘటితం చేస్తున్న క్రమంలోనే కిరాయి హంతకదాడులలో అమరులయ్యారన్నారు. వారి ఆశయాల పరిపూర్తికి, దోపిడీ పీడనలులేని శ్రమజీవన రాజ్యాన్ని నిర్మించడమే వారికి అర్పించే నివాళి అవుతుందన్నారు.

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥యస్.ఝాన్సీ మాట్లాడుతూ భారతదేశంలో భూమి సమస్య కీలకమైనదని, భూమి కేంద్రంగా తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం జరిగిందని, మూడువేల గ్రామాల్లో పదిలక్షల ఎకరాల భూమిని ప్రజలు స్వాధీనం చేసుకుని సాగుచేసుకున్నారని అందుకొరకు నాలుగువేల మంది బలిదానం చేశారని వివరించారు. విప్లవకారుల నాయకత్వాన 1967లో మహత్తర శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం సాగిందని అందులో తొలి అమరులు కామ్రేడ్స్ కోరన్న, మంగన్నలతో సహా వందలాదిమంది అమరులయ్యారన్నారు. తూర్పుగోదావరిజిల్లా కొండమొదలులో భూమికోసం సాగిన సమరంలో కామ్రేడ్స్ కుంజం రాజులు, మడిం లక్ష్మయ్యలు ప్రాణత్యాగం చేశారన్నారు. 1997లో పశ్చిమగోదావరి జిల్లా మనుగోపాలలో దుష్టభూస్వాములు సాగించిన కాల్పులలో కారం పార్వతి నేలరాలిందన్నారు. 1999లో విజయనగరంజిల్లా దుగ్గేరులో భూమికోసం జరిపిన పోరులో కామ్రేడ్ జెన్ని తిరుపతి అమరుడయ్యాడన్నారు. వీరి త్యాగాలు వృధాకావని సామాజిక లక్ష్యసాధనలో నడిచే క్రమంలోనే పున్నయ్య, శంకర్‌లు అమరు లయ్యారంటూ వారికి జోహార్లర్పించారు.

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥జె.కిషోర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు ఆకలిచావులు, ఆత్మహత్యలకు గురవుతున్నారన్నారు. ప్రజాజీవనం సంక్షోభంలో కూరుకుపోతున్నదని, పాలకుల దోపిడీ, దమన కాండలకు వ్యతిరేకంగా పున్నయ్య, శంకర్‌ల స్ఫూర్తితో ప్రజానీకం పోరాడలన్నారు.

ఇంకా ఈ సభలో సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కా॥డివిఎన్ స్వామి; ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥జగ్గారపు సుబ్బారావు; రైతుకూలీసంఘం (ఆం.ప్ర)రాష్ట్ర కోశాధికారి కా॥లలిత; సంఘం రాష్ట్రకమిటి సభ్యులు కా॥శోభారాణి, సంఘం జిల్లా కార్యదర్శి కా॥పి.కోటేశ్వరరావు; సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కా॥నీలాద్రి రాంబాబు, సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥డి. భాస్కరరావు తదితరులు మాట్లాడారు. సభానంతరం ప్రజాకళాకారులు 'నెత్తుటిదీపాలు' నృత్యరూపకం ప్రదర్శించారు.

ooo